



చిన్నబిడ్డతో కలెక్టరేట్ ముట్టడికి వచ్చిన అంగన్వాడీ కార్యకర్త

బెదిరింపులకు భయపడం

- అంగన్వాడీల ప్రధాన సమస్యలను వెంటనే తీర్చాలి
- సమ్మె విరమించకుంటే చర్యలు తీసుకుంటామనడం ప్రభుత్వ చేతగానితనం
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆగ్రహం
- కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్వాడీలు
- భారీగా పోలీసుల మోహరింపు
- లోపలికి వెళ్లనీయకుండా ముళ్లకంచె
- రోడ్డుపైనే నాలుగు గంటలపాటు బైఠాయింపు
- జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- 23వ రోజుకు చేరిన సమ్మె



అంగన్వాడీల ముట్టడితో కలెక్టరేట్‌కు గేటు వేసి ముళ్లకంచెను అడ్డుగా పెట్టిన పోలీసులు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్వాడీలు

కడప (నాగరాజుపేట), జనవరి 3: అంగన్వాడీల ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే తీర్చాలని.. బెదిరింపులకు దిగితే భయపడమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు హెచ్చరించారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారానికి 23వ రోజుకు చేరకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అంగన్వాడీలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ ముట్టడిలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా 5వతేదీన విధులకు హాజరు కావాలని, లేదంటే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామనం జగన్ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు. జగన్ గద్దెనెక్కే ముందు అక్కాచెల్లెలంటూ ఓట్ల కోసం అంగన్వాడీలను ప్రలోభ పెట్టారని, ఇప్పుడు అధికారం చేతిలో ఉన్నా వారి సమస్యలు తీర్చకుండా ఆత్మహత్యలకు ఉసి గొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు హయాంలో జీతాలు పెంచారే తప్ప ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో చేసిందేమీ లేదన్నారు.

తమిళనాడులో 2004లో జయలలిత అంగన్వాడీ కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకు ఎన్నికల్లో ఘోరంగా ఓడిందన్నారు. జగన్‌కు కూడా ఇదే గతి పడుతుందన్నారు. ఎన్నికలకు ముందు తెలంగాణలో కన్నా అదనంగా వెయ్యి ఇస్తామన్నారని.. వెయ్యి మాట దేవుడెరుగు ఇప్పుడు కనీస వేతనం కూడా ఇవ్వడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ వెంటనే అమలు చేయాలని, అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. మినీవర్కర్లకు ప్రమోషన్లను ఇవ్వాలన్నారు. హెల్పర్లకు కూడా నిబంధనల ప్రకారం ప్రమోషన్లు అమలు చేయాలన్నారు. ఇతర బకాయిలు కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈనెల 9న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి పూనుకోవాలన్నారు. లేదంటే విజయవాడలోని అమరావతిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం డిమాండ్లను ఒప్పుకునేంత వరకు పోరాటాలు ఆపమన్నారు.


జగన్ ప్రభుత్వంలో అంగన్వాడీలకు అన్యాయం

సమ్మెకు మద్దతు ఇచ్చిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అంగన్వాడీలకు న్యాయం చేయకపోగా బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. ఒక్క టీడీపీ హయాంలోనే అంగన్వాడీలకు న్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, మనోహర్, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్, నగర కార్యదర్శులు రామ్మోహన్, వెంకటశివ, డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి ఓబులేసు, ఏఐటీయూసీ సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముళ్లకంచె వేసి అడ్డగింపు

అంగన్వాడీల సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ముట్టడికి సిద్ధం కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. 5వ తేదీలోగా విధుల్లోకి రావాలని జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీనిని వారు ఖాతరు చేయకుండా బుధవారం కలెక్టరేట్ ముట్టడికి సిద్ధమవడంతో పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. కలెక్టరేట్ గేట్లు మూసేసి బారికేడ్లు అడ్డుగా పెట్టారు. ముళ్లకంచె వేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బయల్దేరిన అంగన్వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ నిలువరించే ప్రయత్నం చేశారు. అయినా దాదాపు వేయిమందికి పైగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించి సుమారు నాలుగుగంటల పాటు ధర్నా చేశారు. జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.





కలెక్టరేట్ ముట్టడిలో అంగన్వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి





కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్వాడీలు.. కింద ఎక్కువసేపు కూర్చోలేనివారు డివైడర్‌పైన కూర్చున్న దృశ్యం

వైసీపీకి షాక్

- ఫ్యానుకు బైబై చెప్పి సైకిలెక్కిన ఎమ్మెల్సీ సీఆర్సీ
- చంద్రబాబు సమక్షంలో చేరిక
- బలిజ ఓట్లపై ప్రభావం
- నేడు కాంగ్రెస్ గూటికి షర్మిల
- కడప నుంచి పోటీ చేసే చాన్స్ అంటూ ప్రచారం
- జగన్ పార్టీ ఓట్లకు గండి
- ఎన్నికల వేళ అనూహ్య పరిణామాలతో వైసీపీ ఉక్కిరిబిక్కిరి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సొంత జిల్లాలోనే షాక్ తగిలింది. ఎమ్మెల్సీ రామచంద్రయ్య వైసీపీకి బైబై చెప్పేసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. దీని ప్రభావం బలిజ ఓట్లపై పడనుంది. ఇక ముఖ్యమంత్రి సొంత చెల్లి వైఎస్ షర్మిల నేడు ఢిల్లీలో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ రెండు పరిణామాలూ వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

(కడప-ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై జనంలో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఉపాధి లేక నిరుద్యోగులు, సరైన టైమ్‌కు వేతనాలు రాక ప్రభుత్వ ఉద్యోగులు, కరువుతో గిట్టుబాటు రాక రైతులు.. ఇలా అన్నివర్గాలు జగన్ ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. వచ్చేది టీడీపీ - జనసేన ప్రభుత్వమే, చంద్రబాబే సీఎం అనే మౌత్‌టాక్ జనాల్లోకి వెళ్లిపోయింది. పొరుగు జిల్లాల్లో ఇప్పటికే వైసీపీ ఎమ్మెల్యేలు కొందరు బైటికి వచ్చారు. సీట్ల మార్పిడితో వైసీపీ కుతకుతలాడుతోంది. ఇప్పుడు జగన్ సొంత జిల్లాలోనే అటు చెల్లి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటుంటే, ఇటు ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఊహించని విధంగా టీడీపీలో చేరడం వైసీపీని షాక్‌కు గురి చేసింది.



మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో చంద్రబాబుతో సి.రామచంద్రయ్య కరచాలనం

సి.రామచంద్రయ్య ప్రస్థానం ఇలా..

సి.రామచంద్రయ్య 1983 టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగారు. 1985 లో కడప అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో 25 సూత్రాల అమలు శాఖ మంత్రిగా ప నిచేశారు. 1986 నుంచి ఎమ్మెల్యేగా రెండేళ్లపాటు పనిచేశారు. 1988లో ఎస్ఎఫ్‌సీ చైర్మన్‌గా పనిచేశారు. 1989లో రాజంపేట ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 1992 లో తిరిగి కడప పార్లమెంటు నుంచి దివంగత వైఎస్సా ర్‌పై ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 1994లో సివిల్ సప్లై చైర్మన్‌గా పనిచేశారు. 1995లో చంద్రబాబు వెంట నడిచారు. 1998లో ఒక సారి, 2004లో మరోసారి రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించడంతో అందులోకి వెళ్లారు. ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో విలీనం కావడంతో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో దేవదాయశాఖ మంత్రిగా పనిచేశారు. అనంతరం వైసీపీలో చేరగా ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య జగన్‌కు బైబై చెప్పి బుధవారం చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ వార్తతో ఒక్కసారిగా వైసీపీ శ్రేణులు అవాక్కయ్యారు.

బలిజ ఓట్లపై ప్రభావం

సీఆర్సీ వివాదరహితుడుగా పేరు తెచ్చుకున్నారు. బలిజ కులస్తుల్లో నాయకుడుగా ఎదిగారు. ఆర్థిక నిపుణుడిగా పేరుంది. వైసీపీలో బలిజలకు ప్రాధాన్యత లేదంటూ ఇటీవల వైసీపీకి చెందిన బలిజ నాయకులు బహిరంగంగానే విమర్శిస్తూ వచ్చారు. సరైన గౌరవం, గుర్తింపు కానీ లేవని మండిపడుతూ వచ్చారు. కడపలో వచ్చే ఎన్నికల్లో డిప్యూటీ సీఎం మళ్లీ పోటీ చేస్తే వైసీపీకి ఓటు వేయకూడదని బలిజ సంఘం నేతలు తీర్మానం చేసుకున్నారు. తమకు గుర్తింపులేదంటూ రగిలిపోతున్న బలిజ కులస్తులకు సీఆర్సీ టీడీపీలో చేరడంతో వైసీపీ ఓటు బ్యాంకుపై ప్రభావం పడుతుందని అంటున్నారు. వీరంతా టీడీపీ గూటికి చేరుతారనే చర్చ నడుస్తోంది.

షర్మిల కాంగ్రెస్‌లో చేరికతో..

సీఎం వైఎస్ జగన్ సోదరి షర్మిల గురువారం కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ, అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో భర్త అనిల్‌తో కలసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇది వైసీపీకి పెద్ద మైనస్ అవుతుందని అంటున్నారు. జగన్ జైల్లో ఉన్నప్పుడు ఉమ్మడి ఏపీలో షర్మిల కాలికి బలపం కట్టుకుని పాదయాత్ర చేసి పార్టీని నిలబెట్టారు. జగన్ సీఎం అయిన తరువాత షర్మిలను దూరం పెడుతూ వస్తున్నారు. ఆస్తుల పంపకాల్లో తేడా వచ్చిందంటారు. అలాగే సొంత చిన్నాన్న వివేకా హత్య కేసులో ఇరువురి మధ్య బాగా గ్యాప్ పెరిగింది. జగనే షర్మిలను ఏపీ రాజకీయాల్లోకి వచ్చేలా పరిస్థితులు కల్పించారని బ్రదర్ అనిల్ ఎమ్మెల్సీ బీటెక్ రవితో వ్యాఖ్యానించడం చూస్తే.. షర్మిలను జగన్ కుటుంబం దూరం పెట్టినట్లు అర్థమవుతుంది.

కాంగ్రెస్ దెబ్బతినడంతో ఆ పార్టీ సంప్రదాయ ఓట్లయిన క్రిస్టియన్, మైనార్టీలతో పాటు కొంతమంది రెడ్డి సామాజికవర్గం జగన్ పార్టీ వెంట నడిచారు. ఇప్పుడు షర్మిల కాంగ్రెస్ పగ్గాలు చేపడితే ఆ ప్రభావం జగన్ పార్టీపై పడుతుందని అంటున్నారు. సంప్రదాయ ఓటర్లు తిరిగి కాంగ్రెస్‌లోకి వస్తారని అంచనా వేస్తున్నారు. రెడ్డి సామాజిక ఓట్లు కూడా కాంగ్రెస్ పార్టీకి బదిలీ అయ్యే అవకాశం ఉందంటున్నారు. షర్మిల కడప పార్లమెంటు లేదా పులివెందుల అసెంబ్లీ నుంచి పోటీకి దిగి దివంగత మాజీ మంత్రి వివేకా కూతురు సునీతతో కలిసి ప్రచారం నిర్వహిస్తే దాని ప్రభావం వైసీపీపై తీవ్రంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

తండ్రి దివంగత వైఎస్సార్ లాగానే షర్మిల కార్యకర్తలను ఆప్యాయతగా దగ్గరకు తీసుకుంటారని అంటున్నారు. ఇలాంటప్పుడు ఆమె కాంగ్రెస్‌లో చేరి పగ్గాలు చేపట్టి ఎన్నికల బరిలో దిగితే వైసీపీకి సొంత జిల్లాలోనే డ్యామేజీ జరుగుతుందని చర్చ నడుస్తోంది. మొత్తానికైతే అటు ఎమ్మెల్సీ సీఆర్సీ చేరిక, ఇటు షర్మిల కాంగ్రెస్‌లో చేరడం వైసీపీ వర్గాలను కలవరపాటుకు గురిచేస్తోంది.

వైఎస్సార్‌కు షర్మిల నివాళి

వేంపల్లె, జనవరి 3: ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో వైఎస్ షర్మిల కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం తండ్రికి నివాళులు అర్పించారు. ఉదయం 9గంటల ప్రాంతంలో వైఎస్సార్ ఘాట్‌కు షర్మిలతో పాటు భర్త అనిల్, తల్లి విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె తదితరులు చేరుకుని నివాళులు అర్పించారు. అక్కడే సుమారు అరగంట పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మధ్యాహ్నం 2:30గంటల ప్రాంతంలో రోడ్డు మార్గంలో కడప విమానాశ్రయానికి వెళ్లి విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

సమ్మె విరమించక పోతే చర్యలు

- అంగన్వాడీలకు కలెక్టర్ హెచ్చరిక

కడప(కలెక్టరేట్), జనవరి 3: అంగన్వాడీ సిబ్బంది సమ్మె విరమించి 5 వతేదీ లోగా విధుల్లో చేరకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ విజయరామరాజు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో అంగన్వాడీ సిబ్బంది సమ్మె విరమణ కోరుతూ జనవరి, ఫిబ్రవరి మాసాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకాల నిర్వహణపై జేసీ గణేశ్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్‌లతో కలసి ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సీహెచ్‌ఓలు, ఎంఎస్‌ఓలతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది చేపడుతున్న సమ్మె కారణంగా ఆయా కేంద్రాల పరిధిలో బాలింతలు, గర్భవతులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పోషణ వంటి ప్రయోజనాలకు ఆటంకం కలుగుతోందన్నారు. ప్రభుత్వం కూడా వారి డిమాండ్లు చాలా వరకు నెరవేర్చేందుకు ఒప్పుకుందన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భవతుల ఆరోగ్యం పోషణను దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో సమ్మె విరమించేలా నచ్చ జెప్పాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 5వతేదీ లోగా సమ్మె విరమించి విధుల్లో చేరాలని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందన్నారు. ఒక వేళ సమ్మె విరమించకపోతే నిబంధనల మేరకు శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పింఛను రూ.3000కు పెంపు : డీఆర్వో



కడప(కలెక్టరేట్), జనవరి 3: రాష్ట్ర ప్రభుత్వం అవ్వాతాత, ఇతర పింఛన్ దారులకు ఇచ్చే పెన్షన్ రూ.3 వేలకు పెంచిందని డీఆర్వో గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ బహిరంగ సభ నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక మొత్తాన్ని లబ్ధిదారులకు నేరుగా అందజేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి డీఆర్వోతోపాటు డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ తదితరులు హాజరయ్యారు. సీఎం కార్యక్రమం ముగిసిన తరువాత జిల్లాకు చెందిన 2,68,357 మంది లబ్ధిదారులకు మంజూరైన పెన్షన్ కానుక లబ్ధి మొత్తం రూ.79.42కోట్లకు మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం వివరాలకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ, మెప్మా అధికారులు, సచివాలయ సిబ్బంది, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో నుదుటన నామాలతో నిరసన తెలుపుతున్న కార్మికులు



సమస్యలు పరిష్కరించాల్సిందే

- 9వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

కడప, జనవరం 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని సీఐటీయూ నాయకులు సుంకర రవి, పి.జయసింహ, ఇత్తడి ప్రకాశ్ తెలిపారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారంతో 9వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు పొర్లు దండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మికులకు వాగ్వాదం జరిగింది. పోలీసులు సీఐటీయూ నాయకులను అరెస్టు చేశారు.

ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ మున్సిపల్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నుదుటన నామాలు పెట్టుకుని గోవిందా గోవిందా అంటూ నినాదాలు చేస్తూ కార్మికులు ఆందోళన చేశారు. జగన్ ఇచ్చిన హామీలు గోవిందా అంటూ బద్వేలులోనూ పంగనామాలతో నిరసన తెలియజేశారు. మైదుకూరు మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది.



కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పొర్లుదండాలు పెడుతున్న మున్సిపల్ కార్మికులు

వైసీపీ నేతల బెదిరింపులతో
వ్యక్తి ఆత్మహత్య



మృతదేహం - మృతుడు సురేంద్రబాబు (ఫైల్)

రాజంపేట, జనవరి 3 : మండలంలోని బోయినపల్లె సమీపం లోని ఇందిరమ్మ కాలనీలో ఓ స్థల విషయమై బెదిరించడంతో పెరమాల సురేంద్రబాబు అనే వ్యక్తి పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు మన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీలో ఓ స్థలం విషయమై వైసీపీ నేతల మధ్య చాలా రోజులుగా వివాదం చెలరేగుతోంది. మృతుడు నరేంద్రబాబు ఓ స్థలాన్ని స్వాధీనం చేసుకుని అక్కడ ఇల్లు కట్టుకున్నాడు. వైసీపీకి చెందిన రెడ్డెయ్య, పెంచలయ్య, రామకృష్ణలు నరేంద్రబాబును ఆ స్థలాన్ని ఖాళీ చేసి వెళ్లిపోమని బెదిరించడంతో విధి లేని పరిస్థితుల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ భక్తవత్సలంను వివరణ కోరగా బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఓ స్థలం విషయమై మృతుడికి మూడు రోజులుగా ఫోన్‌లో బెదిరింపులు వచ్చాయని తెలిసిందని, దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మంటల్లో చిక్కుకున్న వ్యక్తిని రక్షించిన ఫైర్ సిబ్బంది

కడప (క్రైం), జనవరి 3 : కడప నగరం మోచంపేటలో బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక అధికారి బస్విరెడ్డి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లోపల షేక్ జావేద్‌బాషా అనే యువకుడు ఇంట్లో చిక్కుకోవడంతో ఫైర్ సిబ్బంది అతడిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. పొగ అలుముకోవడంతో ఊపిరాడక స్పృహ తప్పిపోవడంతో ఆ యువకుడిని సీపీఆర్ చేయడంతో ఆ యువకుడు స్పృహలోకి వచ్చాడు. దీంతో వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. దాదాపు లక్ష రూపాయల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ నిందితుడు, దుంగలతో అటవీ శాఖాధికారులు

సుండుపల్లె, జనవరి 3: సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్ రిజర్వ్ ఫారెస్టులో మంగళవారం రాత్రి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమేశ్‌బాబు తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, సానిపాయి రేంజ్ ఆఫీసర్ పీరయ్య ఆదేశాల మేరకు సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్ రిజర్వ్ ఫారెస్టులో మంగళవారం తనిఖీలు చేపట్టామన్నారు. అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆరు ఎర్రచందనం దుంగలు, ఒక కారుతో పాటు తమిళనాడు రాష్ట్రానికి చెందిన మునికందన్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దుంగల విలువ రూ.45,314 ఉంటుందని తెలిపారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎఫ్‌బీవోలు అంజన, స్వాతి, లక్ష్మిప్రసన్న, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టాటాఏస్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు



మృతదేహం వద్ద రోదిస్తున్న మృతుడి భార్య

పోరుమామిళ్ల, జనవరి 3 : మండలంలోని చెన్నారెడ్డిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న టాటాఏస్‌ను కారు ఢీకొనడంతో నగిలి బాలరాజు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. కాగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. విజయ్‌కుమార్ అనే వ్యక్తి కారులో దంతలపల్లెకు వెళుతుండగా పోరుమామిళ్ల చెందిన సుబ్బరాయుడుకు చెందిన సప్లయర్స్‌లో పనిచేస్తున్న బాలరాజు, మరో ముగ్గురు వ్యక్తులు బి.కోడూరు నుంచి పోరుమామిళ్లకు సప్లయర్స్‌ను తీసుకువస్తుండగా విజయకుమార్ అతివేగంగా కారు నడిపి టాటాఏస్‌ను ఢీకొనడంతో టాటాఏస్‌లోని బాలరాజు (35) మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలు కావడంతో వారిని పోరుమామిళ్లలో ప్రథమ చికిత్స అనంతరం కడపకు తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటయ్య పేరిట 'సావేరా' నాటక అవార్డు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 3 : సావేరా.. నాటక సంస్థను స్థాపించి నంది అవార్డుల పంట పండించి నాటక కళద్వారా జిల్లాకు గొప్ప ప్రతిష్ట తెచ్చిన అళ్లూరి వెంకటయ్య పేరిట నాటక అవార్డు ఏర్పాటు చేస్తున్నామని సంస్థ గౌరవ అధ్యక్షుడు, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ మానస కె.చిన్నపరెడ్డి తెలిపారు. బుధవారం సీనియర్ ఆడిటర్ లయన్ ఖాసింఖాన్ కార్యాలయంలో నంది అవార్డు విజేతలైన ఆచార్య మూల మల్లిఖార్జున రెడ్డి, పల్లేటి లక్ష్మికులశేఖర్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ వారసత్వ కళల రక్షణలో భాగంగా జిల్లాకు గర్వకారణంగా నిలిచిన సావేరా సంస్థ నిర్వహణ బాధ్యత తాము తీసుకున్నామని అన్నారు. ఆ సంస్థకు ఊపిరిలాంటి అళ్లూరి వెంకటయ్య పేరిట లయన్ పోతుల వెంకట్రామిరెడ్డితో కలిసి నూతన వైభవం సంతరించి పెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఖాసింఖాన్ మాట్లాడుతూ నాటకరంగంలో జిల్లా ప్రతిష్టను పెంచి సావేరా సంస్థకు కొత్త ఉత్సాహం కల్పించేందుకు కొత్త కమిటీ ఏర్పాటుతో పాటు రూ.1,16,116 కార్పస్ ఫండ్‌తో సంస్థను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు, సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, గొబ్బూరి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రోడ్డును తవ్వేశారు

● ప్రజాధనమంటే లెక్కలేని అధికారులు ● సుందరీకరణ కనిపించాలంటే మళ్లీ పనులు చేపట్టాల్సిందే..



డిసెంబరు 22వ తేదీ బోలేవార్డులో ఉన్న రోడ్డు



డిసెంబరు 23వ తేదీ బోలేవార్డులో నిర్మించిన కొత్త రోడ్డు

పులివెందుల రూరల్, జనవరి 3: పులివెందుల పట్టణంలో కొత్తగా నిర్మించిన రోడ్డును తవ్వేశారు. గత నెల 25న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులకు రానున్న సందర్భంగా బోలేవార్డులో కొత్త తారురోడ్డు నిర్మించారు. మోడల్ టౌన్‌లో భాగంగా బోలేవార్డు పేరుతో పడగొట్టిన బస్టాండ్ నుంచి సత్రం పాఠశాల వరకు సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. డిసెంబరు నాటికి పూర్తికావాల్సి ఉన్న పనులు పలు కారణాలతో ఆలస్యమయ్యాయి. అయితే బోలేవార్డు పనులను ముఖ్యమంత్రికి చూపించాలని అధికారులు తలచారు. డిసెంబరు 22వ తేదీ రాత్రి వరకు లేని రోడ్డు 23వ తేదీ ఉదయానికి నూతనంగా తారురోడ్డు నిర్మించారు. యూజీడీ మ్యాన్‌హోల్స్ ఉన్నప్పటికీ వాటిపైనే కొత్త రోడ్డును నిర్మించారు. ఇపుడు యూజీడీ మ్యాన్‌హోల్స్ పూడకుండా ఎత్తు పెంచాలని మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్‌కు సూచించారు. దీంతో ఆ మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంచి రోడ్డుపైకి కనిపించేలా ఏర్పాటు చేసేందుకు రోడ్డును తవ్వేశారు. లక్షల రూపాయలు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టాలనుకున్నప్పుడు పనులు ఎలా చేయాలో ముందస్తు ప్రణాళిక ఉంటుంది. అలాంటిది రూ.3కోట్లకు పైగా వెచ్చించి బోలేవార్డు సుందరీకరణ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు తవ్వడంతో సుందరీకరణ ఎలా కనిపిస్తుందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజాధనమంటే లెక్కలేకుండా పోతోందంటూ సంబంధిత అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



డిసెంబరు 31వ తేదీ బోలేవార్డులో రోడ్డు దుస్థితి

దివాళా తీసిన బైజూస్‌తో విద్యా వ్యాపారమా?

● తక్షణమే ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి ● ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన

కడప (ఎడ్యుకేషన్), జనవరి 3 : పేద, మధ్య తరగతి విద్యార్థుల జీవితాలను అస్తవ్యస్తం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం బైజూస్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు డిమాండ్ చేశారు. బైజూస్‌తో ఒప్పందానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా బుధవారం కడప నగరం బైజూస్ ఆకాశ్ కోచింగ్ సెంటర్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.3500 కోట్ల ప్రజాధనాన్ని బైజూస్‌కు అప్పజెప్పడానికి రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌ల పేరుతో ఒప్పందం చేసుకుందన్నారు. దీని ద్వారా సబ్జెక్టు అర్థం కాని వారికి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు బైజూస్ ట్యూషన్ పాయింట్‌ను బైజూస్ సంస్థ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇందులో చేరే ప్రతి విద్యార్థి నుంచి రూ.15 వేలు కట్టించుకుని అడ్మిషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎవరైనా ఒక నెల తరువాత తరగతులు వద్దనుకుంటే వారి ఫీజు మొత్తం వాపసు చేస్తామని బైజూస్ ప్రతినిధులు తల్లిదండ్రులకు చెబుతున్నారన్నారు. ఎవరైనా తల్లిదండ్రులు ఒకేసారి రూ.60 వేలు ఫీజు చెల్లించలేనప్పుడు బజాజ్ ఫైనాన్స్ ద్వారా ఈఎంఐ రూపంలో ప్రతినెలా రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు సౌకర్యం కల్పిస్తున్నామని చెబుతున్నారన్నారు. దివాళా తీసిన బైజూస్‌ను గట్టెక్కించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పుంతలు తొక్కిస్తోందన్నారు. ట్యాబ్‌ల పేరుతో కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారని తెలిపారు. ఆ సంస్థను రాష్ట్రంలో నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రాహుల్, నాగేంద్ర, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అరుణ్, శివ పాల్గొన్నారు.



బైజూస్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న దృశ్యం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ : డ్రైవర్ మృతి

వెంకటగిరి, జనవరి 3: ప్రమాదం జరిగి ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా పొదలకూరు నుంచి పిడకల లోడుతో ఓ లారీ తిరుపతికి బయలుదేరింది.

వెంకటగిరి పట్టణం కాంపాళెం సమీపంలోని రాపూరు రోడ్డు మలుపు వద్ద తన లారీని ఓవర్ టేక్ చేసి వెళుతున్న కారును తప్పించబోయి ఎదురుగా ఉన్న కైవల్య నది వంతెన గోడను ఢీకొంది. దీంతో లారీ ముందు టైర్లు పగిలిపోయి అక్కడే ఆగిపోయింది. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. అదే సమయంలో నంద్యాల నుంచి చెన్నైకి ఉల్లిపాయలతో వెళుతున్న లారీ తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఆగి ఉన్న లారీని వెనుక వైపునుంచి అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో లారీ క్యాబిన్‌లో చిక్కుకుని డ్రైవర్ హరి (45) మృతి చెందాడు. మృతుడిది కడప జిల్లా మైదుకూరు అరుంధతీవాడగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్యాబిన్‌లో చిక్కుకుని మృతి చెందిన లారీ డ్రైవర్

వైవీయూ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా లక్ష్మీప్రసాద్



నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మీప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 3 : వైవీయూ ప్రవేశాల సంచాలకులుగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎర్త్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసరు డాక్టర్ లక్ష్మీప్రసాద్ నియమితులయ్యారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపీ వెంకటసుబ్బయ్య నియామకపత్రాన్ని లక్ష్మీప్రసాద్‌కు అందించారు. ఇదివరకు ఈ స్థానంలో పనిచేసిన ప్రొఫెసరు కంకణాల గంగయ్య పదవీకాలం పూర్తి కావడంతో ఈ నియామకం చేసినట్లు చెప్పారు. అసోసియేట్ డైరెక్టర్లుగా డాక్టర్ పి.వసు గోవర్ధనరెడ్డి, డాక్టర్ ఎ.మునికుమారి, డాక్టర్ రెడ్డయ్య, డాక్టర్ ఎన్.గణేశ్ నాయక్‌లను నియమించారు. వీరి స్థానాల్లో ఇది వరకు ఉన్న వారు బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

'బొజ్జ అరెస్టు హేయమైన చర్య'



సమావేశంలో మాట్లాడుతున్న గాలిచంద్ర

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 3 : రాయలసీమకు సాగు, తాగునీరు ఇవ్వాలని కోరిన రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకుడు బొజ్జ దశరథరామిరెడ్డిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం హేయమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

నీరు అడిగితే సంకెళ్లా?: సీఐటీయూ

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 3 : సాగు, తాగునీరు అడిగితే సంకెళ్లు వేస్తారా అంటూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు, రైతు ఉద్యమ నాయకులు బొజ్జ దశరథరామిరెడ్డి అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొజ్జను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు సుదర్శనరెడ్డి మాట్లాడారు.

అయోధ్యరామయ్య అక్షింతల వితరణ

కడప (కల్చరల్), జనవరి 3: ఎట్టకేలకు అయోధ్య రామయ్య స్వామివారి పవిత్ర అక్షింతలు కడప నగరానికి చేరుకున్నాయి. వాటిని భక్తిశ్రద్ధలతో స్థానిక 9వ డివిజన్‌లో గల సీతారాముల దేవాలయంలో ఉంచి పూజలు చేశారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి, నగర 9వ డివిజన్ ఇన్‌చార్జ్ బత్తల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వితరణ చేశారు.

వైఎస్ షర్మిలను కలిసిన విష్ణుప్రీతం రెడ్డి

కడప(కలెక్టరేట్), జనవరి 3: తన కుమారుడి వివాహ వేడుకకు సంబంధించి ఇడుపులపాయకు వచ్చి తిరుగు ప్రయాణంలో బుధవారం కడప విమానాశ్రయానికి వచ్చిన వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, మాజీ మంత్రి మైసూరారెడ్డి మేనల్లుడు విష్ణుప్రీతంరెడ్డి, ఆ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

కడప(కలెక్టరేట్), జనవరి 3: ఏపీ ఎన్జీఓ ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన ఎన్జీఓ సిటీ యూనిట్ టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ విజయరామరాజు బుధవారం ఆవిష్కరించారు. కలెక్టర్‌ను కలిసిన సంఘ నేతల్లో జిల్లా నాయకులు తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, శ్రీనివాసులు, శ్రీనివాసులు, రాజశేఖర్ వాసన్, నాగార్జున్, నగర అధ్యక్షుడు చిన్నయ్య, శైలేశ్వర్ రెడ్డి, పద్మనాభం ఉన్నారు.

సర్పంచుల శంఖారావంలో వేముల నేతలు

వేముల, జనవరి 3: మంగళగిరిలో బుధవారం జరిగిన సర్పంచుల శంఖారావం కార్యక్రమానికి వేముల మండల టీడీపీ నాయకులు హాజరయ్యారు. మాజీ సర్పంచులు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, సి.బ్రహ్మయ్య, కె.కృష్ణారెడ్డి, సి.సతీష్‌కుమార్‌రెడ్డి, ఇ.శివారెడ్డి, పి.మునేంద్ర, ఎస్.సీ.పల్లె వెంకటేశ్‌లు పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి టీడీపీ సర్పంచులు, మాజీ సర్పంచులు హాజరయ్యారు.

ఎల్ఐసీలో వేతన సవరణ తక్షణం చేపట్టాలి

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 3 :ఎల్ఐసీ యాజమాన్యం సంస్థలో వేతన సవరణ తక్షణం చేపట్టాలని సిబ్బంది సంఘాల జాయింట్ ఫ్రంట్ నాయకులు చంద్ర, అవధానం శ్రీనివాస్, శైలజ డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ డిసెంబరు నెలలో చర్చలని చెప్పి ఉద్యోగ సంఘాలను ఆహ్వానించి వాటిని అర్థాంతరంగా వాయిదా వేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగంలో వేతన సంవత్సరం చర్చలు కొలిక్కివచ్చాయని, ఎల్ఐసీలో వేతన సవరణ గడువు ముగిసి 18 నెలలైనా, ఇంకా చర్చలే ప్రారంభం కాకపోవడం అన్యాయమన్నారు.

టెంకాయల వేలం రూ.4.25 లక్షలు

సీకేదిన్నె, జనవరి 3: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మగుడి టెంకాయల వేలం రూ.4.25 లక్షలకు జి.రాజశేఖర్‌రెడ్డి దక్కించుకున్నట్లు ఆలయ ఈఓ సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. టెంకాయల ద్వారా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అదనంగా రూ.1.17 లక్షలు వచ్చిందన్నారు. అలాగే తలనీలాలు రూ. 3.6 లక్షలకు జె.పుల్లయ్య వేలంపాట దక్కించుకున్నారన్నారు. తలనీలాల ద్వారా గత సంవత్సరం కంటే ఒక వెయ్యి అదనంగా వచ్చిందని, అదే విధంగా కొబ్బెర చిప్పల అర్థ బాగం సేకరించుకునే హక్కులను రూ.34 వేలకు రామాంజనేయులు దక్కించుకున్నారని గత సంవత్సరం కంటే రూ.2 వేలు అదనంగా ఈ సంవత్సరం వచ్చినట్లు మొత్తంమీద రూ.1.20 లక్షలు ఆదాయం పెరిగినట్లు ఈవో తెలిపారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం: పుట్టా

ఖాజీపేట, జనవరి 3: రాష్ట్రంలోని మహిళలు అభివృద్ధి చెందడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. పత్తూరు పంచాయతీలో దయాంబాష్‌పల్లె, కూనవారిపల్లె పంచాయతీలోని దళితవాడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

కడప నగరం...చెత్తమయం

కడప (చిన్నచౌకు), జనవరి 3 : మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో కడప నగరమంతా చెత్తతో నిండిపోయింది. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. దీంతో కడప పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడం వల్ల ప్రధాన రహదారిపై ఎక్కడిపడితే అక్కడ చెత్త నిలిచిపోయింది. పూర్తిస్థాయిలో చెత్త పేరుకుపోవడంతో అది గాలికి వచ్చి దారిన పోయే వారిపై పడడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయం ఏర్పాట్లు నామమాత్రంగా చేయడంతో ప్రయోజనం లేకుండాపోయింది. కాలనీల్లో సైతం డ్రైనేజీల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి ఎక్కడికక్కడ మురుగు నీరు రోడ్డుపైకి వస్తూ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. ఇళ్లల్లో వెలువడే వ్యర్థాలు ఎక్కడ వేయాలో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి పట్టణంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని కోరుతున్నారు.



ప్రకాశ్‌నగర్ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త

సమస్యలు పరిష్కారం కాకుండా సమ్మె విరమించేది లేదు

● బెదిరింపులకు బెదిరేది లేదు ● 9వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 3 : కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కాకుండా సమ్మెను విరమించేది లేదని సీఐటీయూ నాయకులు సుంకర రవి, పి.జయసింహ, ఇత్తడి ప్రకాశ్ తెలిపారు. బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. బుధవారం కడప నగరం కార్పొరేషన్ ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరింది. కార్మికులు పొర్లు దండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మికులకు వాగ్వివాదం జరిగింది. పోలీసులు సీఐటియు నాయకులు సుంకర రవి, జయసింహ, డి.నరసింహులును అరెస్టు చేశారు. అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొంది. అలాగే కార్పొరేషన్ ఎదుట వైసీపీ ప్రభుత్వానికి కార్మికులు పొర్లుదండాలు చేస్తూ నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటియు నగర కార్యదర్శి ఇత్తడి ప్రకాశ్ మాట్లాడుతూ సమ్మె మొదలై తొమ్మిదిరోజులు అవుతున్నా ఈ ప్రభుత్వానికి కార్మికుల పట్ల న్యాయం చేసేందుకు చిత్తశుద్ధి లేదన్నారు. కంచుపాటి శ్రీరాం మాట్లాడుతూ కోవిడ్ సమయంలో తాము దేవుళ్లమయ్యామని ఈ రోజు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే నేరస్తులుగా అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. న్యాయమైన డిమాండ్ నెర వేర్చేందుకు మా పోరాటానికి అడ్డు తగలవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచుపాటి తిరుపాల్, గోపీకిరణ్, శ్రీధర్‌బాబు, నాగరాజు, ఆదాం, వై.రమేష్, కొండయ్య, దస్తగిరి, కొండమ్మ, ధరణితో పాటు పలువురు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

తెలుగుదేశం పార్టీదే విజయం: పుత్తా





పెండ్లిమర్రి: కార్యక్రమంలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి...చెన్నూరు: బాబుతో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

పెండ్లిమర్రి, జనవరి 3: వచ్చే ఎన్నికల్లో విజయం తెలుగుదేశం పార్టీదేనని, టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చెర్లోపల్లె పంచాయతీలోని దశరిపల్లే, కోరవాండ్లపల్లె, చెర్లోపల్లె, పగడాలపల్లె, ద్వారకానగర్ గ్రామాలలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపారు. అలాగే వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే పథకాలతో రాష్ట్ర ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు రాష్ట్రానికి అవసరమన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చంద్ర ఓబుళరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చీమలపెంట సర్పంచు ప్రతాపరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రామాంజనేయులు, టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, సారథిరెడ్డి, ఆరవేటి చంద్రారెడ్డి, అయ్యవారురెడ్డి, చెంద్రాయుడు, రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అన్నమయ్య, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

'కష్టాలు తీరాలంటే చంద్రబాబే రావాలి'

చెన్నూరు, జనవరి 3 : వైసీపీ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో అన్ని వర్గాలకు ద్రోహం చేసిందని, అందరి కష్టాలు తీరాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా పార్లమెంటరీ అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం పేర్కొన్నారు. మండలంలోని రామనల్లెలో బుధవారం బాబుతో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబును ఆదరించాలి, టీడీపీని గెలిపించాలన్నారు. ప్రధానంగా బీసీలు, ఎస్సీల జీవితాల్లో వెలుగులు రావాలంటే చంద్రబాబు లాంటి విజన్ ఉన్న నేతలను మనం సీఎంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ముండ్ల నరసింహారెడ్డి, రామనపల్లె క్రిష్టారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు పత్తి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



ప్రచారం చేస్తున్న జనసేన జిల్లా కోఆర్డినేటరు సుంకర శ్రీనివాస్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 3: రాష్ట్రంలో అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని జనసేన జిల్లా కోఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కడప నగరం 30వ డివిజన్ నాగరాజుపేట రవి థియేటర్ నుంచి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. జనసేన నాయకులు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కార్పొరేటరు ఉమాదేవి



చంద్రబాబుతో మాట్లాడుతున్న కార్పొరేటరు ఉమాదేవి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 3 : అమరావతి టీడీపీ కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును కడప 49వ డివిజన్ కార్పొరేటరు జి.ఉమాదేవి కలిశారు. కడప నియోజకవర్గం అభ్యర్థిత్వాన్ని చంద్రబాబుతో చర్చించారు. ఈ విషయంపై చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

ధ్రువతార సావిత్రీబాయి పూలే

కడప (మారుతీనగర్), జనవరి 3: ఆధునిక భారత చరిత్రలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, స్త్రీల విద్యాపురోగతికి శ్రమించిన తొలితరం ధ్రువతార సావిత్రీబాయి పూలే అని బీసీ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాసా కోదండరామ్ కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురష్కరించుకుని బీసీ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు రానున్న పరీక్షలకు వీలుగా ప్యాడ్స్, పెన్నులు, చాక్లెట్స్ పంపిణీ గావించి మాట్లాడారు. పురుషులతో పాటుగా స్త్రీలు కూడా విద్యనభ్యసించడం సహజ హక్కు అని ఉద్ఘోదించి తద్వారా అనునిత్యం తపించిన సామాజిక విప్లవ మాతృమూర్తి అన్నారు. ముఖ్యంగా కులవ్యవస్థ నిర్మూలనుకు తపించిన వీరోచిత మహిళగా ఖ్యాతిగాంచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర నాయకులు గిరిచరణ్, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, శేషయ్య, వెంకటేష్, అయ్యవారయ్య, వెంకటరమణ, శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేసిన దృశ్యం

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో....

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి ఆ సంఘం జిల్లా మహిళా నాయకురాలు వల్లూరు నారాయణమ్మ, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమ అనంతరం ఉపాధ్యాయురాలు నీలవేణి, మల్లేశ్వరి, లక్ష్మీదేవిలను సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, వర్కింగ్ ప్రసిడెంట్ గోవిందునాగరాజు, ప్రధానకార్యదర్శి త్రివిక్రమ్, సీనియర్ నాయకులు కళ్యాసుధాకర్, మునిరత్నంగౌడ్, ఉపాధ్యక్షులు పస్తం అంజి, మహిళానాయకురాళ్ళు జయశ్రీ, ధనలక్ష్మి, వెంకటలక్షుమ్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

సింహాద్రిపురం, జనవరి 3: సింహాద్రిపురం ఎమ్మార్సీ భవనంలో బుధవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమానతల సమాజంపై జ్యోతీరావు పూలే, సావిత్రిబాయిపూలే ధిక్కార స్వరం వినిపించారన్నారు. వారి విశేష కృషి వల్లే నేడు ఈ సమాజంలో ప్రతి ఒక్కరూ అక్షరాలు నేర్చుకుంటున్నారన్నారు. భర్త అడుగు జాడల్లో నడచి సంఘంలో జరుగుతున్న అనేక అణచివేతలను ఎదిరించిన ధీశాలి సావిత్రిబాయి పూలే అన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మెగా డీఎస్సీ విడుదల చేయమంటే అరెస్టులా..?

● డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు



నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప (నాగరాజుపేట), జనవరి 3 : మెగా డీఎస్సీ విడుదల చేయమంటే అరెస్టులు చేయడం తగదని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) నగర కార్యదర్శి డీఎం ఓబులేసు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ విడుదల చేయాలని విజయవాడలోని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కార్యాలయం ఎదుట శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. బుధవారం కడప పూలే సర్కిల్‌లో డీవైఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం ఓబులేసు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో పాదయాత్రలో ఉన్నప్పుడు తాను అధికారంలోకి వచ్చాక ఏటా డీఎస్సీ విడుదల చేస్తామని హామీ ఇచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటినా ఇప్పటికి ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. డీఎస్సీ విడుదల చేయాలనే ఆలోచన సీఎంకు లేదనేది స్పష్టమవుతోందన్నారు. నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురు చూస్తూ కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు డబ్బు ఖర్చుపెట్టుకుంటున్నారన్నారు. తీరా ఉద్యోగాలు రాక వయసు దాటిపోయి చివరికి బలవన్మరణాలకు పాల్పడుతుండడం దారుణమన్నారు. దీనిపై ప్రభుత్వాన్ని అడిగితే అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. నియంతలా కర్కశంగా బట్టలు చించి అరెస్టులు చేయడం దేనికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా 25వేల పోస్టుల్లో మెగా డీఎస్సీ విడుదల చేసి తన మాట నిలుపుకోవాలని, లేదంటే రాబోవు ఎన్నికల్లో జగన్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, పవన్, నాయకులు ఉదయ్‌గిరి, బాషా పాల్గొన్నారు.

'అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు'

చెన్నూరు, జనవరి 3 : రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలతో పాటు అన్నివర్గాలకు వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అన్నారు. రూ.3వేలు పెన్షన్‌ను బుధవారం లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అల్లె శ్రీరామ్మూర్తి, మండల ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్బారెడ్డి, సర్పంచులు తుంగా చంద్రయాదవ్, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్‌ను అటకెక్కించిన జగన్‌రెడ్డి: బీజేవైఎం



మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

కడప (మారుతీనగర్), జవవరి 3: జాబ్ క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అటకెక్కించారని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వై.జంక్షన్ వద్ద గల బీజేవైఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి చేపట్టిన మీ కోసం పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల ఓట్ల కోసం సుమారు 190 హామీలను గుప్పించారన్నారు. వాటిలో కేవలం 17 హామీలు తప్ప మిగతావన్నింటినీ గాలికి వదిలేశారన్నారు. రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులు జగన్‌ను విశ్వసించే పరిస్థితే లేదన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 5వ తేదీ నుంచి పాత కలెక్టరేట్ వద్ద ఒక్కరోజు నిరాహారదీక్ష చేపడుతున్నట్లు వెల్లడించారు. దీక్షలకు ముఖ్య అతిథులుగా బీజేపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు. కావున ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, కార్యదర్శి ఓబులయ్య, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, ట్రెజరర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి సీఆర్సీ రాక హర్షణీయం

● సొంత గూటికి రాకపై బలిజ నేతల్లో ఆనందం

చెన్నూరు, జనవరి 3 : ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య టీడీపీలో చేరడంపై చెన్నూరు టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో రాజకీయంగా టీడీపీలో చేరి వివిధ రకాల పదవులతో పాటు రాజ్యసభ సభ్యుడిగా పదవులు అనుభవించిన ఆయన వైసీపీలో చేరినా అక్కడ ఇమడలేక పదవుల కన్నా గౌరవమే ముఖ్యమని తిరిగి టీడీపీలోకి రావడంతో మండలంలోని టీడీపీ నేతలతో పాటు బలిజ సంఘం నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం చెన్నూరు బస్టాండులో బలిజ సంఘం జిల్లా నాయకులు టీడీపీ సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు గంధం ప్రసాద్, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, మాజీ ఎంపీటీసీ గౌస్‌పీర్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ఖాజాహుసేన్, పట్టణ అధ్యక్షుడు ఆకులచలపతి మాట్లాడుతూ మండలంలో రాజకీయపరంగా నేటికీ సీఆర్సీ అంటే ఎనలేని అభిమానం, గౌరవం ఉన్నాయని, 1984లో ఆయన పార్టీలో ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు అభిమానం చెక్కుచెదరలేదన్నారు. ఎన్నికల్లో ఆయన ప్రభావం చెన్నూరుపై ఉంటుందని అలాంటి నేతను టీడీపీలో చేరాలని గతంలో చెన్నూరు నేతలు వత్తిడి చేసినా కొన్ని కారణాలతో ఆగారన్నారు. అయితే ఎట్టకేలకు బుధవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరడం హర్షణీయమన్నారు. బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటసుబ్బయ్య, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి మంజూర అహ్మద్, బలిజ సంఘం సీనియర్ నేతలు రిటైర్డ్ ఎన్జీఓ పాలకొండయ్య, మాజీ సర్పంచ్ జింకా సుబ్బరాయుడు, వెంకట్రమణ, సుబ్బరాయుడు, రమణయ్యతోపాటు పలువురు బలిజ సంఘం నేతలు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేంపల్లె, జనవరి 3: మండలంలోని పలు గ్రామాలతో పాటు వేంపల్లె పట్టణంలోని పలు ప్రాంతాలలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈలు శివ, శివదినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రామిరెడ్డిపల్లె సబ్‌స్టేషన్‌లో ఉన్న ముత్తుకూరు ఫీడర్, ఆర్‌డీఎస్ఎస్ పనులకు సంబంధించి మరమ్మత్తుల కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం 1:30గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే వేంపల్లె పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా భాగంగా ఆర్చి నుంచి పిల్లస్వామి గుట్ట, శ్రీరామ్‌నగర్, ఇమామ్‌నగర్, పుల్లయ్యతోట, కాటా రామయ్య మరియు తిరుమల హాల్ సెంటర్ తదితర ప్రాంతాలలో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ మరమ్మత్తులు చేయనున్నట్లు తెలిపారు. కావున గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. కావున వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వేములలో...

వేముల, జనవరి 3: మండలంలోని గొల్లలగూడూరు, పెర్నపాడు, నల్లచెరువుపల్లె, పెద్దజూటూరు సబ్‌స్టేషన్‌ల పరిధినియంత్రణలో ఉన్న గ్రామాలలో గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని విద్యుత్ శాఖ ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఆరు సూత్రాల కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి'



వేంపల్లెలో తులసిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా నాయకులు

వేంపల్లె, జనవరి 3: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే ఆరు సూత్రాల కార్యక్రమాలపై విస్తృతంగా ప్రజలలో ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అన్నమయ్య జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, లీలా శ్రీనివాస్, సోమశేఖర్‌రెడ్డి, చెన్నకృష్ణా, పృథ్వి, శ్రీనివాస్ వేంపల్లెలోని తులసిరెడ్డిని కలిశారు. త్వరలో కాంగ్రెస్ అగ్రనాయకులు పర్యటిస్తారని తులసిరెడ్డి తెలిపారు.

పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలి

కడప (మారుతీనగర్), జనవరి 3: మై భారత్- వికసిత్ భారత్ 2047 అనే అంశంపై ఈనెల 8వ తేదీ సోమవారం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్ మీటింగ్ హాల్‌లో తలపెట్టనున్న ఉపన్యాస పోటీలలో యువత తప్పక పాల్గొనాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ పేర్కొన్నారు. బుధవారం స్థానిక యువకేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు

ప్రొద్దుటూరు ,జనవరి 3 : జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని అందువల్లే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీటు మార్పులు చేస్తున్నారని టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం 26 వవార్డులో చేపట్టారు, కార్యక్రమంలో టీడీపీనేతలు బద్వేలి రవి,చీమల రాజశేఖర్‌రెడ్డి, తలారి రమేష్, బాయికాడ బాబు ,నగిలి వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ది ఘోరమైన పాలన : వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు,జనవరి 3 : జగన్ పాలన చాలా ఘోరమైందని ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవడానికి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయిబాబా కొట్టాల, వసంతపేట చర్చివీధి, ఆణాబంకు వీధులలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ ముందస్తు మ్యానిఫెస్టోలోని ఆరు గ్యారెంటీ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య,ఆసంరఘురామిరెడ్డి,నాగమునిరెడ్డి,తలారిపుల్లయ్య,వద్ది బాలుడు, ఎర్రన్న, పాములేటి నరసింహులు, సోమా బాలయ్య,ప్రముఖవస్త్రవ్యాపారి నందం రామయ్య, చిన్నా, సుబ్బారాయుడు, బచ్చలప్రతాప్,పల్లా శంకర్, వంగల నారాయణ రెడ్డి, జీసీ పుల్లయ్య, ధనిరెడ్డిరామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ కలయికతో వైసీపీ గల్లంతు

ప్రొద్దుటూరు , జనవరి 3 : జనసేన, టీడీపీ కలయికతో వైసీపీ గల్లంతు కానుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డిసతీమణి మౌనికా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొత్త పల్లెపంచాయతీ లింగాపురంలోబాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మెన్ బండి భాస్కర్‌రెడ్డి,టౌన్‌బ్యాంక్‌డైరెక్టర్ బొగ్గుల సుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి, నాగరాజు, కానపల్లె దేవాంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం: పుట్టా

ఖాజీపేట, జనవరి 3: రాష్ట్రంలోని మహిళలు అభివృద్ధి చెందడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పత్తూరు పంచాయతీలో దయాంఖాన్‌పల్లె, కూనవారిపల్లె పంచాయతీలోని హరిజనవాడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పుట్టా ప్రభాకర్‌యాదవ్, జానకీరాం, పొట్టిరాముడు, రామయ్య, గంగాధర్, మాబు, గంగయ్య, చిన్న, ప్రసాద్, రెడ్డయ్య, ఫరూక్, సుబ్బయ్య, ఖదీరుల్లా,రామానాయుడు,హరినాథరెడ్డి, కృష్ణారెడ్డి, పుల్లయ్యనాయుడు, వీరయ్య, జలీల్, రమణ, హబీబ్, సందీప్‌నాయుడు, గౌస్, నరసింహ, కేకే బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియం..: మండల పరిధిలోని మేడిదిన్నె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్ రెడ్డి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ ప్రవేశపెట్టిన ఆరు పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాపారాయుడు, నాగరాజ్, పొన్నపురెడ్డి జయరామిరెడ్డి, బోడె న్న, వెంకటేశ్, చిన్నపెద్దయ్య, పెద్దపెద్దయ్య, శ్రీనివాసులు, సురేంద్ర, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.





ప్రొద్దుటూరులో ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఖాజీపేటలో మహిళల సమస్యలు వింటున్న పుట్టా సుధాకర్‌యాదవ్



పెద్దముడియంలో మేనిఫెస్టోను వివరిస్తున్న భూపేశ్‌రెడ్డి





ప్రొద్దుటూరులో టీడీపీ మినీ మేనిఫెస్టోను వివరిస్తున్న మౌనికారెడ్డి, నంద్యాల కొండారెడ్డి

పలు సంఘాల కేలండర్ల ఆవిష్కరణ



బద్వేలులో కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌జీవోసంఘం నేతలు

బద్వేలు, జనవరి 3: నూతన సంవత్సర కేలండర్‌ను స్థానిక ఎన్‌జీవో హోంలో బుధవారం ఏపీ ఎన్‌జీవో సంఘం అధ్యక్షులు రొండా అమర్‌నాథరెడ్డి, ట్రెజరర్ శివరామిరెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఉద్యోగులంతా ఐకమత్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మల్లికార్జునరావు, యంగయ్య, జాయింట్ సెక్రటరీ వెంకటమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, ఈసీ మెంబర్ మదుసూధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్-2024 డైరీ, కేలండరు...

కలసపాడు, జనవరి 3 : కలసపాడు మండలం జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ హైస్కూలులో ఏపీటీఎఫ్-2024 కేలండరు, డైరీని ఎంఈవోలు ప్రేమ్‌సాగర్, ఎస్.మస్తాన్‌వలి, హెచ్‌ఎం పి.కవిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలజోజి, మండల అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బాల ఓబయ్య. ఆర్థిక కార్యదర్శి ప్రభాకర్, సభ్యులు కిరణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కేలండర్...



కాశినాయనలో ఎస్టీయూ నూతన కేలండరును ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశినాయన జనవరి 3: నర్సాపురం ఎమ్మార్సీలో బుధవారం ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎం.రవీంద్రబాబు,స్టేట్ కౌన్సిలర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఎంఈవో(1) ప్రేమసాగర్ చేతుల మీదుగా ఎస్టీయూ 2024 సంవత్సరం కేలండరును ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకుడు వాకా చంద్రశేఖర్ మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సేవలు మరింత మెరుగు పరుచుకోవాలి

ప్రొద్దుటూరు, జనవరి 3 : వినియోగదారులకు అందించే విద్యుత్ సేవలు మరింత మెరుగు పరుచుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ఎన్‌వీ సుబ్బరాజు సూచించారు. బుధవారం డివిజన్ ఇంజనీర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ వ్యవసాయ సర్వీసులు నిర్ణీత గడువులోగా రిలీజ్‌చేయాలన్నారు. విద్యుత్ సరఫరా ఫీడర్స్‌లో అంతరాయాలు తగ్గించుకోలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్ సరిగా మెయింటనెన్స్ చేయకపోవడం వలన ఫెయిలూర్స్ వస్తున్నాయని వాటిని తగ్గించాలన్నారు. విద్యుత్ బకాయిలు వసూళ్లలో నిర్లక్ష్యం తగదన్నారు. సరఫరాలో నష్టాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డివిజన్ ఈఈ శ్రీనివాసులరెడ్డి, డీఈలు ఏడీఈలు, ఏఈలు జేఏవో అకౌంటెంట్లు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రజలకు ఏమి చేసిందని సాధికారిత సభ'

జమ్మలమడుగు, జనవరి 3: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏమి చేశారని సాధికారత సభలు నిర్వహిస్తున్నారని జమ్మలమడుగు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అల్లం సూర్యనారాయణ విమర్శించారు. బుధవారం జమ్మలమడుగు జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ తప్పిదాలు, వ్యతిరేక విధానాలను విమర్శించినవారిపై అక్రమంగా కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. పోలీసులు ముందస్తు అరెస్టు నోటీసులు ఇవ్వకుండా జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రను కారణం లేకుండా అరెస్టు చేయడం ఎంతవరకు సబబు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యదర్శి నల్లంశెట్టి నాగార్జున, హరినాథరెడ్డి, ఆవుల వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారం

దువ్వూరు (మైదుకూరు), జనవరి 3: స్థానిక సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్నకు చెబుదామనే స్పందన కార్యక్రమం ప్రవేశపెట్టిందని కలెక్టర్ వి.విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం దువ్వూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద వివిధ శాఖల మండల అధికారులతో కలసి జగనన్నకు చెబుదామనే కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీదారుడు సంతోషపడేలా సమస్య పరిష్కరించాలన్నారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక రోజు ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని, సమస్యలకు వేగవంతమైన పరిష్కారం దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి అందివ్వాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులుతో పాటు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరీమహాదేవి ఆరాధన మహోత్సవాలు విజయవంతం చేయండి

ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం జేఏసీ చైర్మన్ పి.హనుమంతరావు



బ్రహ్మంగారిమఠం, జనవరి 3 : జగన్మాత ఈశ్వరీ మహాదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు జనవరి 3 నుంచి 8వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం జేఏసీ చైర్మన్ పావులూరి హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆయనతో పాటు ప్రముఖ న్యాయవాది పి.గురుప్రసాద్‌లు పాత్రికేయులతో మాట్లాడారు. ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాల్లో భాగంగా 5న శుక్రవారం ఈశ్వరీ మహాదేవి సజీవ సమాధి నిష్ఠ వహించిన నందున ఆ రోజు అమ్మవారి సన్నిధానానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణుల మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సారె, కుంకుమ, పసుపు తీసుకుని సమర్పించడం జరుగుతుందని వారు తెలిపారు. వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధానం నుంచి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారె మఠాధిపతులకు అందించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక విశ్వబ్రాహ్మణ కమిటీ సభ్యులు అధ్యక్షుడు నిరంజనాచారి, ప్రధాన కార్యదర్శి గోపాల్, కోశాధికారి గురుబ్రహ్మం, ఎంపీటీసీ మనోహరాచారి, సుధాకర్, వీరభద్రయ్య, సీతారామశాస్త్రి పాల్గొన్నారు. కాగా బుధవారం కలశోత్సవం నిర్వహించారు.

బొజ్జా దశరథరామిరెడ్డి అరెస్టు అక్రమం

మైదుకూరు, జనవరి 3 : రైతు నాయకుడు బొజ్జా దశరథరామిరెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అక్రమమని రైతు సేవా సమితి అధ్యక్షుడు ఏవీ రమణ పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ రైతుల తరుపున రాయలసీమ సాగునీటి సాధన సమితి పేరుతో అనేక ఉద్యమాలు చేసి, రైతుల పక్షాన పోరాడిన అయనపై అక్రకమ కేసు పెట్టి అరెస్టు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయివారు

పోరుమామిళ్ల, జనవరి 3 : డిసెంబరు నెల 30,31తేదీల్లో విజయవాడ క్రిష్ణలంకలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్లచెందిన క్రీడాకారుల జాతీయ స్థాయికి ఎంపికైనట్లు మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. వీరు రాజస్థాన్‌లో ఈ నెల 19 నుంచి 21వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. 30, 31 తేదీల్లో జరిగిన పోటీల్లో సాయిప్రీతి, నయీం, సాయిమనోజ్ బంగారు పతకాలు, ఆసిఫ్, మహీర్ రజత, సీనియర్ విభాగంలో ఎస్.భవ్య బంగారు పతకం, అస్మిన్ రజత, ఉస్మాన్ రజత పతకం సాధించినట్లు తెలిపారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఖాజీపేట, జనవరి 3: పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కడప నార్త్ ఏఎస్పీ రెడ్డిబాష అన్నారు. బుధవారం ఖాజీపేట వీధుల గుండా నినాదాలు చేస్తూ గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దారు ఉదయభారతి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఇండియా పోస్టల్ మేనేజర్ శ్రీదేవి, మునాఫ్, పోస్టుమాస్టర్ హరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

దత్తాపురంలో టీడీపీ కార్యాలయం ప్రారంభం



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కొండాపురం, జనవరి 3: మండలంలోని దత్తాపురం గ్రామంలో బుధవారం టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. స్థానిక మెయిన్‌రోడ్డులో ఆంజనేయస్వామి గుడి ప్రక్కన కార్యాలయాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు.మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, సుధాకర్‌నాయుడు,ఈశ్వరరెడ్డి,బాలనాగిరెడ్డి,వినయ్‌కుమార్‌రెడ్డిపాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలలో ప్రోటోకాల్ ఏదీ..?

● స్థానిక సర్పంచ్ ఆవేదన

జమ్మలమడుగు, జనవరి 3: జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో అభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవాలలో ప్రోటోకాల్ పాటించలేదని గ్రామ సర్పంచ్ ఇంజేటి గురుదేవి, వార్డు మెంబర్లు వాపోయారు. బుధవారం ఉదయం 9 గంటలకు గ్రామంలోని నూతనంగా నిర్మించిన సచివాలయం, హెల్త్‌సెంటర్, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. అయితే కార్యక్రమం ఆలస్యం కావడంతో జనాలు వెళ్లిపోయారు. అయితే గ్రామంలో ప్రారంభోత్సవాలకు, పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గీయులైన సర్పంచ్ గురుదేవికి కార్యక్రమానికి పిలుపులేదని వారు తెలిపారు. అయితే గ్రామంలో వైసీపీలోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ సమస్యకు సంబంధించి ఎంపీడీవో రాఘవేంద్రనాథ్‌కు 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా సర్పంచ్ గ్రామ ప్రథమ పౌరురాలని, ఆమెకు తమ సెక్రటరీ ద్వారా పిలుపు అందిందని, లేకపోతే ఏదైనా సమస్య ఉంటే విచారించి సెక్రటరిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఘనంగా రితీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



రితీష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలు టౌన్, జనవరి 3 : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో యువనేత రితీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో కొంకుల రాంబాబు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అభిమానులు, కార్యకర్తలు రితీష్‌రెడ్డికి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో రితీష్‌రెడ్డి అభిమానులు, కార్యకర్తలు పలు చోట్ల అన్నదాన కార్యక్రమం, పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కొంకుల రాంబాబు, పట్టణ అధ్యక్షులు వెంగల్‌రెడ్డి నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, మాచుపల్లె క్రిష్ణారెడ్డి. జహంగీర్‌బాషా, బిగ్‌బాస్, తుడిమెళ్ల వెంకటసుబ్బయ్య, నాగభూషణం, నానబాల వెంకటేశ్వర్లు, కొంకుల రమణ, అలంగీర్, హసన్, బెనర్జీ, జయరామయ్య, ఉప్పలపాటి వెంకటసుబ్బయ్య, వాసు, ఫరీద్, మణికంఠ, లక్ష్మీదేవి, మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..: మండలంలో రితీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అమగంపల్లె సమీపంలోని బాలమ్మ సత్రంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానంతోపాటు పండ్లు, బ్రెడ్ పంపిణీచేశారు.ఈకార్యక్రమంలో కడప టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,తెలుగు యువత అధ్యక్షుడు పి.రవీంద్రారెడ్డి, టీడీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి,పోలిరెడ్డి,క్రిష్ణారెడ్డి,వెంకటరెడ్డి, రోహిత్‌రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి,శ్రీనివాసులరెడ్డి,నరసింహారెడ్డి, అడవిరాముడు.వెంకటసుబ్బారెడ్డి,ఏసయ్య,నారాయణ తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న విజయమ్మ

అట్లూరు..: బద్వేలు టీడీపీ యువనేత రితీష్‌కుమార్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం అట్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, పేదలకు అట్లూరు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల విద్యార్థులకు కేక్ కట్ చేసి పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ఎం.మహేశ్వర్ రెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, జయక్రిష్ణారెడ్డి, బి.విష్ణువర్ధన్‌రెడ్డి, బి.సుధాకర్‌రెడ్డి, మన్యం రామసుబ్బారెడ్డి, సంజీవయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



వృద్ధులకు భోజన ప్యాకెట్లు అందిస్తున్న మాచుపల్లె లక్ష్మీదేవి తదితరులు

బద్వేలు రూరల్..: తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రితీష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 21వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ మాచుపల్లె వెంకటక్రిష్ణారెడ్డి, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, తెలుగు యువత కడప పార్లమెంటు ఉపాధ్యక్షులు జహంగీర్‌బాషాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండులో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ముందుగా వృద్ధులతో కలిసి కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం అక్కడ ఉన్న వృద్ధులందరికీ భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తార్, మాచుపల్లె కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

సమ్మె సాగటానికి ప్రభుత్వానిదే బాధ్యత

ప్రొద్దుటూరు ,జనవరి 3 : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కారానికి సమ్మె దీర్ఘకాలికంగా కొనసాగవలసి వస్తోందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బీర్రు విజయకుమార్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ మున్సిపల్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన సమ్మె 9 వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా జగన్ ఇచ్చిన హామీలు గోవిందా గోవిందా అంటూ నినాదాలు చేస్తూ పంగనామాలు పెట్టుకొని కార్మికులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చంటి , సాల్మన్, రాఘవేంద్ర, రవికుమార్‌మోహన్, గుర్రమ్మ, రమాదేవి, ప్రమీలమ్మ, నీతమ్మ పాల్గొన్నారు.

బద్వేలు..: మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా హామీలు గోవిందా అంటూ పంగనామాలతో వినూత్న నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు , శ్యాం ప్రవీణ్, దియ్యాల హరి, దేవమ్మ, గంటా శ్రీనివాసులు, శివకుమార్ పాల్గొన్నారు.

మైదుకూరు..: మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట సుబ్బయ్య, కళ్యాణ్, జెర్మియా, ఓబులేసు, చిన్న, గంగులయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

టీడీపీ రాష్ట్ర శంఖారావం సదస్సుకు హాజరైన నారాయణయాదవ్

బ్రహ్మంగారిమఠం, జనవరి 3 : మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర శంఖారావం సదస్సుకు బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లె టీడీపీ నేత చిలమల నారాయణయాదవ్ హాజరయ్యారు. వారితో పాటు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ హాజరైనట్లు ఆయన తెలిపారు.

